క్లుప్తంగా

పనుల సర్దుబాటుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయులకు సంబంధించిన పనుల సర్దుబాటుపై పారదర్శకంగా లేకుండా ఇష్టానుసారంగా చేశారని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. దాదాపు పది మండలాల్లోని ఉపాధ్యాయులకు సంబంధించిన ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు తావూరియా, ఎం.రాజయ్య, పాషాలున్నారు.

'మన ఊరు-మన బడి' పనులపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: అమ్మ ఆదర్శ పనులు, మన ఊరు మన బడి పనులపై వివరణ ఇవ్వాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 'మన ఊరు మన బడి' 'అమ్మ ఆదర్శ పాఠశాలలోనూ' నత్తనడకన పనులు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంఈఓ, ఇరిగేషన్‌శాఖ అధికారులను పనులపై ఆరా తీశారు. పనులను పెండింగ్ లేకుండా సత్వరమే పూర్తి చేయాలని, సగంలో నిలిచిపోయిన పనులను ఎస్‌ఆర్‌ఈజీఎస్ స్కీమ్ ద్వారా పూర్తి చేయాలని, ప్రహరీలు, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్లు పనులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారని ఎంఈఓ శ్రీరాంమూర్తి తెలిపారు.

ఆదివాసీ గిరిజనుడి డిశ్చార్జ్

జూలూరుపాడు: జూలూరుపాడు పీహెచ్‌సీలోని డెంటల్ యూనిట్‌లో లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్లకు చెందిన ఆదివాసీ కుంజా కన్నారావు దవడ ఎముకలకు శస్త్రచికిత్స చేశారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ పోటు వినోద్ తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజస్విని, సీహెచ్‌ఓ రామకృష్ణ, హెచ్ఎన్ వరలక్ష్మీ బాయి, స్టాఫ్‌నర్సులు నాగమణి, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

టోకెన్ సమ్మె నోటీసు అందజేత

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డికి బుధవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వారి ఆధ్వర్యంలో టోకెన్ సమ్మె నోటీసును అందజేసినట్టు బుధవారం ఒక ప్రకటనలో యూనియన్ నాయకులు తెలిపారు. బిల్లులు ఆలస్యం అవుతున్న విషయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ బిల్లులు లేకుండా అందరికి ఒకే బిల్లు ఇవ్వాలని, మరికొన్ని డిమాండ్ల పరిష్కారానికి సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి, లక్ష్మణ్, ఎండూరి ప్రభావతి, జిల్లా నాయకులు ఉన్నారు.

ఆలిండియా మహాసభను జయప్రదం చేయండి

టేకులపల్లి: సెప్టెంబర్ 1, 2 తేదీల్లో పూణే నగరంలో జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ 8వ మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాణోతు రాంసింగ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభించడంలో మొండిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నాయకులు రాజు, నాగులు, సురేష్ పాల్గొన్నారు.

రక్షణ,ఉత్పత్తి విషయంలో నిర్లక్ష్యం

సింగరేణి(కొత్తగూడెం): రక్షణ, ఉత్పత్తి విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ప్రధానంగా అండర్ గ్రౌండ్‌లో కార్మికుల పనిస్థలాల వద్ద వెంటిలేషన్, లైటింగ్ లేదని, సైడ్ రూఫ్స్ సపోర్టింగ్‌ను ఏర్పాటు చేయాలని కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ అన్నారు. ఏరియా పరిధిలోని పీవీకె-5 ఇంక్‌లైన్ గని సమస్యలపై గని మేనేజర్ శ్యాంప్రసాద్‌తో బుధవారం రజాక్ చర్చించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ... సర్ఫేస్‌లో మెయిన్ గేట్ నుండి చెడిపోయిన రోడ్డు స్థానంలో కొత్తరోడ్‌ను వేయాలని, కొత్త వెహికిల్ షెడ్డు నిర్మాణం చేపట్టాలని, క్యాంటిన్ వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా ఫ్లోరింగ్ చేయించాలని కోరారు. స్పందించిన జీఎం సౌకర్యాలు మెరుగుపరుస్తామని, రక్షణతో కూడిన ఉత్పత్తి చేయడానికి నాయకులు సహకరించాలని కోరారు. చిలక రాజయ్య, నవీన్, బాలు, అఖిల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రారంభమయ్యేనా?

కేటాయింపునకు నోచుకోని ఇల్లెందు మార్కెట్ గదులు

- పాలకవర్గానికి నాలుగు నెలలే గడువు
- 8 నెలల్లో పూర్తి చేయాల్సిన భవనానికి ఐదేళ్లు
- పూర్తి కాని మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు

ఇల్లెందు: వందేళ్ల చరిత్ర ఉన్న ఇల్లెందు పట్టణానికి మార్కెట్ లేదని మోడల్ మార్కెట్‌కు రూపకల్పన చేశారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన మార్కెట్‌ను కూలదోసి దాని స్థానంలో నూతన మార్కెట్ నిర్మించారు. జిల్లాల్లో అతి పెద్ద మార్కెట్‌గా ఇల్లెందు మారనుంది. పట్టణ నడిబొడ్డున రూ.8.50 కోట్లతో 182 గదులతో అందుబాటులోకి వస్తే రోడ్డు మీద ఒక్క కూరగాయల వ్యాపారి ఎండకు ఎండాల్సిన అవసరం వానకు తడవాల్సిన అవసరం ఉండదు. అయితే ఈ మోడల్ మార్కెట్ ప్రారంభోత్సవానికి గ్రహణం వీడట్లేదు. భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా తుది పనులు పూర్తి చేయాల్సి ఉంది. మరుగుదొడ్లు, అంతర్గత రోడ్లకు రూ.50 లక్షలు కేటాయించారు. ఈ నిధులకు టెండర్ పూర్తయ్యింది కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇక మరో రూ.50 లక్షలు నిధులతో కాంపౌండ్ వాల్, 182 గదులకు గదికో మీటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. టెండర్ జరగాల్సి ఉంది. ఇదిలా ఉండగా విజయదశమికి పనులు పూర్తి చేయాలని అదే రోజున ప్రారంభోత్సవం చేపట్టాలని మున్సిపల్ పాలకవర్గం సమాలోచన చేస్తోంది.



నిర్మాణ దశలో ఉన్న మోడల్ మార్కెట్

శంకుస్థాపనకు ఆరేళ్లు పూర్తి..

2019 ఆగస్టు 04న మోడల్ మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆరేళ్లు పూర్తయినా అందుబాటులోకి రాలేదు. టీయూఎఫ్ఐడీసీ ఫండ్స్‌తో రూ. 8.50 కోట్లతో మోడల్ మార్కెట్ చేపట్టారు. 8 నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా ఆరేళ్లు గడిచిపోయింది. ఏటా గడువు పొడిగిస్తున్నారు. మార్కెట్ భవనాల్లో కింద అంతస్తులో 92 గదులు, పై అంతస్తులో 90 గదులు నిర్మించారు. ఇంకా మరుగుదొడ్లు, వాటర్ సరఫరా, పార్కింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

విజయదశమికి ప్రారంభోత్సవం జరిగేనా ?

ఇల్లెందు మున్సిపాలిటీకి ఆదాయ మార్గం ఉన్నా ప్రయోజనం సున్నా అన్నట్లు తయారైంది. 182 గదుల షాపింగ్ కాంప్లెక్సులు అద్దెకు ఇస్తే లక్షల ఆదాయం లభిస్తుంది. పట్టణ నడిబొడ్డున వ్యాపారులు ఎండకు ఎండి వానకు తడుస్తున్నారు. ఈ తరుణంలో రెడీగా ఉన్న కాంప్లెక్సులను కేటాయింపులు చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. విజయదశమి నాటికి ప్రారంభోత్సవం చేయాలనుకుంటే ఇప్పటి నుంచే గదులు కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చటం లేదు.

అందుబాటులోకి తీసుకు రావాలి..



పట్టణ నడిబొడ్డున కోట్ల రుపాయలతో చేపట్టిన మార్కెట్ నిర్మాణం సకాలంలో జరుగక పోవటం వల్ల వ్యాపారులకు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి వ్యాపారులు సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్‌పాలకులు సదుపాయల మీద దృష్టి సారించటం లేదు.

– హరిప్రసాద్ యాదవ్, ఇల్లెందు

త్వరలో ఉపయోగంలోకి తెస్తాం..



మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తైంది. కేవలం ప్రహరీ, టాయిలెట్స్ నిర్మించాల్సి ఉంది. ఇందుకు రూ.50 లక్షలు నిధులు విడుదల కాగా టెండర్ పూర్తయ్యింది. ఒకటి రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. మరో రూ. 50 లక్షల పనులకు టెండర్ జరుగాల్సి ఉంది.

– జి. రాజు, ఏఈ పంచాయతీ రాజ్ విభాగం, ఇల్లెందు మున్సిపాలిటీ

విజయదశమికి ప్రారంభం



పట్టణ నడిబొడ్డున ప్రజలకు వ్యాపారులకు ఎంతో ఉపయోగంగా ఉండే మోడల్ మార్కెట్ విజయదశమికి ప్రారంభించాలనుకుంటున్నాం. తుది పనులు కూడా వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పనులు పూర్తి అయ్యేలోపు షాపులు కేటాయింపులు కూడా పూర్తి చేస్తాం.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపాలిటీ చైర్మన్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ బుదవారం కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజుకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రాన్ని సీఅండ్ఎండీ ఎన్.బలరామ్‌కు అందేవిధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యాదర్శి మందా నర్సింహారావు మాట్లాడుతూ.. బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియ రద్దు చేసి తెలంగాణలోని బ్లాకులను సింగరేణికి కేటాయించాలన్నారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, సింగరేణికి రావాల్సిన రూ.29 వేల కోట్ల బకాయిలను వెంటనే రాబట్టాలన్నారు. 190/240 మస్టర్లు పూర్తిచేసిన బదిలీలను వెంటనే రెగ్యులైజ్ చేయాలని, మెజార్టీ ఓట్లు వచ్చిన సంఘానికి రెండేళ్ల కాల పరిమితితో గుర్తింపుపత్రం ఇవ్వాలన్నారు. బ్రాంచి నాయకులు జి.రాజారావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కొత్తపల్లి రమేష్, వెంకటేశ్వర్లు, దుర్గాభవాని, సమ్మయ్య, పీవీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రామికుల పక్షాన నిరంతర పోరాటం


సుజాతనగర్: రైతులు, శ్రామికులు ఉత్పత్తి అనుబంధ రంగాల శ్రమ చేసేవారంతా కార్మికులే అని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది ఏఐటీయూసీ మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. బుధవారం సుజాతనగర్‌లో ఏఐటీయూసీ ద్వితీయ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ.. సెప్టెంబర్ 22న ఆటో యూనియన్ రాష్ట్ర మహాసభలు కొత్తగూడెంలో జరుగుతున్నాయని, ఈలోగా ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల రాములు మాజీ ఎంపీపీ భూక్య పద్మావతి, మాజీ ఎంపీటీసీ మూడు గణేష్, సీపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, నాయకులు కొమారి హనుమంతరావు, పాదిల శ్రీనివాసరావు, వీర్ల మల్లేష్, మురళి, తాళ్లూరి పాపారావు, బొడ్డు కేశవరావు, తాళ్లూరి ధర్మారావు, గోపి పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవం

పాల్వంచ: పట్టణ పరిధిలోని పాత పాల్వంచలో నూతనంగా నిర్మించిన శ్రీ విజయశాంభవి అమ్మవారి దేవాలయంలో దివ్య ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవావారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు కొడమంచిలి ఫణికుమార్ శర్మ బృందం ఆధ్వర్యంలో మూడు రోజులుగా మంగళవాయిద్యాల నడుమ హోమాలు, విగ్రహాలకు జలదివాసం, క్షీరాధివాసం, నీరు, పాలతో అభిషేకాలు నిర్వహించారు. చివరి రోజు శ్రీ విజయశాంభవి అమ్మవారు, గణపతి, జంటనాగులు, పోతురాజు స్వామి, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, విమలాదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కొత్వాల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఉత్సవాల నిర్వాహకులు నిమ్మల భద్రయ్య, నిమ్మల మల్లిఖార్జునరావు, సీతారాం, వెంకట్రావ్, వెంకన్న, వీరభద్రం, బ్రహ్మం, రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

రుణమాఫీకి షరతులు విధించటం సరికాదు


సింగరేణి(కొత్తగూడెం): రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం షరతులు విధించటం సరైందికాదని, ప్రభుత్వ విధానాలు ఒడ్డుకొచ్చిన తర్వాత తెప్పతగలెసిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఐకేఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్ అన్నారు. ఈ మేరకు ఏఐకేఎస్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీనివాస్, ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణ, అడుసు మల్లి సాయిబాబు, వెంకటేశ్వరరావు, యాస రోశయ్య, రాంచందర్, రమేష్, ఇమ్మానియేల్, ౼ప్రూ, కోటి నాగేశ్వరరావు,శ్రీనివాస్, పాల్గొన్నారు.




సింగరేణి(కొత్తగూడెం): కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేఎస్ నాయకులు

ఇల్లెందురూరల్: షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ న్యూడెమోక్రసీ అనుబంధ ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా చేసి డిమండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు తుపాకుల నాగేశ్వరరావు, నాయకులు చిన్నస్వామి, మూడు మాలు, ఇర్ప విజయ్, వజ్జ మధు, చింత రజిత, వాంకుడోత్ శ్రీను, ఆజ్మీర శంకర్, కొక్కు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ నాగభవానికి వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎం మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, మండలాధ్యక్షుడు ఎట్టి నరసింహారావు, నాయకులు కల్తీ స్వామి, లక్ష్మి, సాల నారాయణ, రుక్కమ్మ, సర్వన్ పాల్గొన్నారు.



టేకులపల్లిలో..



ఇల్లెందురూరల్: తహసీల్ ఎదుట..

మధ్యాహ్న భోజన హామీ అమలుచేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన హామీని అమలుచేయాలని, ఖాళీగా ఉన్న సివిక్స్ సబ్జెక్టు అధ్యాపకుని నియమించాలని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జె.గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మండల పరిధి బస్వతారాక కాలనీ పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. నాయకులు విష్ణు, అనిత, రమ్య, సంగీత, పి.రవి, నవీన్, కె.నాగబాబు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

టేకులపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న ఖమ్మంలో నిర్వహించే ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని ప్రగతిశీల పంచాయతీ వర్కర్ల యూనియన్ నాయకులు మూడు బిచ్చు, మండల కార్యదర్శి సిరికొండ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన పంచాయతీ మండల సమావేశంలో మాట్లాడారు. డి.ప్రసాద్, నాను, ఉదయ్, నరసయ్య, సైదులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

లాభాల్లో వాటా కేటాయించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటాను కేటాయించాలని ఎస్‌సీసీడబ్ల్యూ (ఇఫ్టూ) యూనియన్ ప్రధాన కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం రైటర్‌బస్తీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన లాభాల్లో వాటానికి కేటాయించాలని కోరారు. తెలంగాణ వస్తే బాగుపడితే, అన్న బతుకుల్లో చీకటి నింపారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, కృష్ణ, పోశయ్య పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

పాల్వంచ: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్ అన్నారు. బుధవారం స్థానిక బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామ్‌చరణ్ మాట్లాడుతూ... సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వం చెల్లిస్తున్న చాలీచాలని మెస్ చార్జీలతో పౌష్టికాహారం అందడం లేదన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

ఇల్లెందు: పత్రాలు లేని వాహనాలు నడపొద్దని, ఎవరైనా నడిపితే ప్రమాదాలకు గురైతే వారిపై శిక్షలు కఠినంగా ఉంటాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ చంద్రభాను అన్నారు. పట్టణంలో తెల్లవారుజాము నుంచే పోలీసులు పట్టణంలోని 1వ, 2వ వార్డులోని సత్యనారాయణపురంలో బుధవారం నాకాబందీ నిర్వహించారు. ఇంటింటిని తనిఖీ చేసి వాహనాలు, వాటి పత్రాలు, లైసెన్సు, బీమా పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలోకి వచ్చే కొత్త వ్యక్తుల సమాచారం అందించాలని, మత్తు, మాదకద్రవ్యాలను వినియోగించొద్దని, ఎవరైనా సరఫరా చేస్తే వారి సమాచారం ఇవ్వాలని సూచించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు సీజ్ చేశామని, కొన్ని వాహనాలకు జరిమానా విధించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలి



విద్యార్థులతో కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: బాల కళాకారులు సాంస్కృతిక కార్యాక్రమాల్లో రాణించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచలోని శ్రీ అలివేలు మంగా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో, శ్రీ షిరిడి సాయిబాబా భజన మందిరంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి బాల కళాకారులకు నృత్య పోటీలు నిర్వహించారు. ఉట్టి కొట్టించి, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. పూజారులు సింహాద్రి ఆనందకుమార్ ఆచార్యులు, చిలుకూరి దినకర శాస్త్రీ ఆధ్వర్యంలో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొత్వాల సత్యనారాయణ, కిలారు సుజాత, ముత్యాల కోటేశ్వరరావు, కోలాటం శ్రీలక్ష్మీ, ముత్యాల రమణమూర్తి, రాంబాబు, తనమల లక్ష్మీ, రంగమ్మ, ముదిగొండ శ్రీను, రమాదేవి, వెంకటేష్, భాస్కర్, ప్రభాకర్, గోవర్ధన్ ఉన్నారు.

డిపోలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలి



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఇల్లెందు బస్‌డిపో ప్రారంభోత్సవం జరిగి ఏడాది గడుస్తున్నా డిపోలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడంలేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.అజయ్ అన్నారు. బుధవారం ఇల్లెందులో పార్టీ ఆధ్వర్యంలో బస్‌డిపో ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ సంజీవరాణికి వినతిపత్రం అందజేశారు. పూర్తి స్థాయి డిపోగా అప్‌గ్రేడ్ చేయాలని, నూతన బస్‌లను ఏర్పాటు చేసి పాత బస్‌లను తొలిగించాలని, ఇల్లెందు డిపో పరిధిలో పక్కా రోడ్డు సదుపాయం ఉన్న పల్లెలకు బస్‌లను నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యదల్లపల్లి సావిత్రి, బుర్ర రాఘవులు, దేవా, ముత్తక్క, సరిత, వెంకటమ్మ, కుమారీ, యాకుబ్‌షావలీ, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'సీతారామ' నీళ్లు జూలూరుపాడుకు ఇవ్వాలి



ఏన్కూర్ లింక్ కెనాల్‌ను పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

జూలూరుపాడు: సీతారామ నీళ్లు జూలూరుపాడు మండలానికి ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలోని నాయకుల బృందం సీతారామ రాజీవ్ ఏన్కూర్ లింక్ కెనాల్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాత డిజైన్ ప్రకారం సీతారామ కెనాల్ పనులు కొనసాగించాలని, రీ డిజైన్‌తో జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. పాత డిజైన్‌ను అమలు చేసి జిల్లాలోని 20 మండలాలకు సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌ను అనుసంధానం చేసి, సాగు భూములకు గోదావరి జలాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, శివ, బన్నీ, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళి

ఇల్లెందు: బషీర్‌బాగ్ అమరవీరులకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఇల్లెందులో అఖిలపక్ష నేతలు ర్యాలీ నిర్వహించి నాటి అమరవీరులను స్మరించుకున్నారు. నాయకులు ఏపూరి బ్రహ్మం, సారయ్య, సీతారామయ్య, యాకుబ్‌షావలీ, తుపాకుల నాగేశ్వరరావు, అన్వర్‌పాషా, ఆలేటి కిరణ్, సారంగపాణీ, రాజారాం, మల్లెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాగ్దానం ప్రకారం వేతనం చెల్లించాలి



ఆందోళన చేస్తున్న ఐకేపీ, వీవోఏలు

సింగరేణి(కొత్తగూడెం): ఐకేపీ, వీఓఏలకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా, ప్రభుత్వ వాగ్దానం ప్రకారం రూ.26 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. తెలంగాణ ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు నిర్వహించిన సమ్మె వద్దకు వచ్చిన వీఓల డిమండ్‌ను ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు బలపరిచారన్నారు. జీఓ నంబర్ 59ని రద్దుచేయాలని, మూడు నెలకొకసారి రెన్యూవల్ చేసే విధానాన్ని తొలగించాలన్నారు. పద్మా, శ్రీనివాస్, వీరన్న, సత్య, రమేష్, రేష్మ, అనురాధ, నాగరాజు, రాము, రోజా, సుజాత, చంద్రకళ, రాము పాల్గొన్నారు.

వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాల్వంచరూరల్: మండలపరిధిలోని యానంబైల్ గ్రామంలో బుధవారం ఉల్వనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్, ఎంపీహెచ్ఏలు బి.శంకర్, జ్యోతి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

రుణమాఫీ కుటుంబ సర్వే ప్రారంభం



పాల్వంచరూరల్: రైతు కుటుంబసభ్యులతో సెల్ఫీ తీసుకుంటున్న ఏఓ



జూలూరుపాడులో..

పాల్వంచరూరల్: రుణమాఫీకి సంబంధించి రైతు కుటుంబ నిర్ధారణ సర్వే మండలంలో బుధవారం వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏఓ శంభోశంకర్ సర్వే నిర్వహించారు. రుణమాఫీకాలేదని దరఖాస్తులు చేసుకున్న రైతుల ఇళ్లకు వెళ్లి రైతు కుటుంబ సభ్యులతో కలిసి సెల్ఫీ తీసుకున్న ఫొటోతోపాటు ఆధార్‌కార్డు వివరాలను అప్‌లోడ్‌చేసి ఉన్నతాధికారులకు పంపించారు.

సుజాతనగర్: రుణమాఫీలో భాగంగా రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాల నిర్ధారణ సర్వే కార్యక్రమం సీతంపేట బంజర గ్రామంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీతంపేట, సీతంపేట బంజర గ్రామాలకు చెందిన రైతుల వివరాలను అధికారులు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. రుణమాఫీ కాని రైతులు 330 మంది ఉన్నట్లు ఏఓ నర్మద తెలిపారు. ఏఈఓలు నరసింహా, ప్రనూష, శరత్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రుణమాఫీ కానీ రైతు కుటుంబాల నిర్ధారణ కార్యక్రమాన్ని జూలూరుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి దీపక్ ఆనంద్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రేషన్ కార్డు లేకపోవడంతో 1,097 రైతు కుటుంబాలకు రుణమాఫీ కాలేదన్నారు. ఏఈఓలు గోపిక్రిష్ణ, గౌస్, భాను, రైతులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల రైతువేదికలో నిర్ధారణ ప్రక్రియను వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. ఈ ప్రక్రియను ప్రస్తుతం పంచాయతీల వారీగా చేపడుతున్నామని ఏఓ సతీష్ తెలిపారు.